ఇది చాలా మంచివూరు—అనుకున్నాడు రమాపతి.

అంతటితో వూరుకోకుండా ఆ అభిప్రాయాన్ని బాహాటంగా పదిమందితోనూ చెప్పేశాడు..

"అలాగా" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించారు కొందరు. "నిజం, నిజమే" అంటూ ఏకీభవించారు కొందరు. 'రీసెర్చి చేసి గొప్ప విషయమే కనిపెట్టాడయ్యా ఈ ప్రబుద్ధుడు' అనుకున్నారు కొందరు.

తలా ఒక విధంగా అనుకుని తలలు పంకించుకుని ఎవరి దారిని వాళ్ళు వెళ్ళిపోయారు లోకులు. వాళ్ళల్లో మచ్చు కొక్కడైనా రమాపతి అభిప్రాయానికి ప్రాధాన్య మిచ్చిన పాపాన పోలేదు.

కానీ యిది చాలా మంచి వూరని అన్నాడో లేదో యింతలేసి కళ్ళతో అతడివైపు ఆశ్చర్యంగా చూసి "ఐనా ఈ వూరిని గురించి మీ కప్పుడే ఏం తెలిసిందండీ! అసలు మనమీ వూరికి వచ్చి ఎంతకాలమైంది ?" అంటూ భర్తను నిలదీసి అడిగింది రాజేశ్వరి.

చొప్పదంటు సందేహాన్ని వ్యక్తపరచినందుకు చిరచిర లాడిపోతూ, తన విజ్ఞతను శంకిస్తున్న భార్యకేసి చురచుర చూచాడు రమాపతి!

ఆమాత్రానికే వెనుకంజవేసే తత్వంగాదు రాజేశ్వరిది! "అదేమిటండీ! అలా చూస్తారు ? చూపులకే గ్రుడ్లు తేలవేసి క్రిందపడి పోవడానికి నేనేమీ కొంగనుకాను లెండి!" అంటూ ఓ పురాణ గాథను జ్ఞప్తికి తెచ్చింది రాజేశ్వరి.

ఆడవాళ్ళతో గొప్ప విషయాలు చెప్పనే గూడదనుకున్నాడు రమాపతి. చెప్పి అవహేళన పాలైనందుకు కించపడ్డాడు. తనీ విషయాన్ని ఎందరితో చెప్పాడు! అందరూ తన అభిప్రాయాన్ని యథాతథంగా ఆమోదించేశారు. రాజేశ్వరికేం తెలుస్తుంది ? ఈవిడకు వితండవాదం తప్పా మరొకటి చేతగాదు.

—ఐనా నాలుగు గోడల మధ్య జీవితాన్ని గడపుకుపోవడానికి అలవాటుపడిన ఆడవాళ్ళకేవూరైతేనేమి ? వాళ్ళకా వూరెంతో, ఈ వూరూ అంతే! ఇక్కడి హెడ్మాస్టరుగారు మంచివారనీ, సహోపాధ్యాయులు స్నేహితులంటే ప్రాణాలు విడిచిపెట్టేస్తారనీ, విద్యార్థులు ఉపాధ్యాయుల కనుసన్నల్లో మసలుకుంటారనీ, చివరికిక్కడి హోటలు సర్వర్లు, చిల్లరంగడి వర్తకులు, జట్కాబళ్ళ సాహెబులు సైతం ఎంతో మర్యాదస్తులనీ విశదంగా వివరాలు ఏకరువు పెడితే మాత్రం ఈవిడకు వాస్తవం అవగత మౌతుందన్న నమ్మకమేమిటి?

తీరా తానింతగా కంఠశోష పెట్టుకున్న తరువాత రాజేశ్వరికి సరిక్రొత్త సందేహాలు స్ఫురించవని మాత్రం రమాపతి ఎలా అనుకోగలడు ?

రమాపతికి మౌనమే శరణ్యమైంది.

కానీ ఎలాంటి దురభిప్రాయాలనైనా సమూలంగా తుడిచిపెట్టగలిగినది కాలం ? కాలం గడిచినకొద్దీ రాజేశ్వరికి వాస్తవం తనంతటదే తెలిసి వస్తుంది లెమ్మనుకున్నాడు రమాపతి.

కాలం దొర్లిపోతోంది.

నిన్న గాక మొన్ననే జరిగినట్టున్నా రమాపతి సతీసమేతుడై ఆ వూరిలో కాపురం పెట్టి, అప్పుడే నెల రోజులు గడిచిపోయాయి.

ఓరోజు ఉదయం లాబొరేటరీలో ఏదో ప్రయోగం కోసం రమాపతి ఉపకరణాలను ఎన్నుకుంటూ ఉండగా ఓ విద్యార్థి సుడిగాలిలా వచ్చిపడ్డాడు. ఎవడో ఒకడు ఆగంతకుడు ఆఫీసు రూం వరాండాలో తనకోసం వేచి ఉన్నాడట! 'రమాపతిగారెక్కడ, రమాపతిగారెక్కడ' అంటూ అతడు కనుపించిన వారినల్లా వాకబుచేసి పారేస్తుంటే వసారాలో కూర్చోమని చెప్పి, ఈ విద్యార్థి తనకోసం యిలా పరుగెత్తి వచ్చాడట!

ఎవరో బంధుసత్తముడు కాబోలు ననుకున్నాడు రమాపతి. ఇల్లు దూరకముందే ఎలుకల రాకడని చెప్పనే చెప్పారు మరి!

బంధువైనా బాగుండేది! ఓ కుర్రాడిని తోడిచ్చి ఇంటికి పంపగలిగి ఉండేవాడు రమాపతి. ఆగంతకుడు బంధువు కాడు. ఒక మానాన వదలిపెట్టడు. తుమ్మబంకలా అంటుకున్నాడు. "సన్నగా, తుంగ కాడలా ఉండేవాడివి, ఇప్పుడు బాగా కండబట్టి పోయావురా రమాపతీ! రైటో రైటో! మనిషన్న తర్వాత ఆమాత్రం పుష్టిగానైనా ఉండాలి. నాకేం తెలుసు—నువ్వీవూళ్ళో ఉన్నావని! నా పనేమిటో, నా లోక మేమిటో! ఈరోజెవరో కుర్రాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగా విన్నాను. 'మా సైన్సు మాష్టరు రమాపతిగారు ఎంత బాగా పాఠం చెబుతారనానుకున్నావురా' అంటూ ఓ కుర్రాడు తెగ మురిసిపోతున్నాడు. పేరు వినగానే నా బుర్రలో ఓ మెరుపు మెరిసింది! దగ్గరికి పిలిచి విచారిద్దును గదా, నా అనుమానం కాస్తా నిజమైపోయింది. ఎలాగైతేనేం, నిన్ను కనిపెట్టేశాను. అన్నట్టు ఎప్పుడొచ్చావు ? ఏం కథ ? ఈవూరు నీ కెలా ఉంది ? ఎక్కడుంటున్నావు ? ...." మాటల ధోరణి సంగతలా ఉండగా, ఆగంతకుడి వేషం కూడా చూపరులను ఆకర్షింపగలిగిందనే చెప్పాలి. అతడు కాకీ ట్రౌజరు తొడుక్కున్నాడు. రంగు అరచొక్కా వేసుకున్నాడు. ఆ దుస్తులపైన మసి మరకలకు కొదువ లేదు. క్రాపింగు బుట్టలా పైకి లేచింది. చెంపలపైన చెమట ధారలు ధారలుగా స్రవిస్తోంది.

పది పదిహేనుగురు విద్యార్థు లక్కడ ప్రోగైపోయారు. టీచర్సు రూములోనుంచి నలుగు రైదుగురు ఉపాధ్యాయులు గూడా బయటికి వచ్చేశారు. జవాను రాఘవులైతే స్తంభం చాటున నిల్చుని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నాడు.

ఉదయం తాను నిద్రలేచిన వేళ మం[illegible] కాదేమో ననుకున్నాడు రమాపతి. లేకుంటే తనకిలా తలవంపులు కలిగేవి కావు. ఎదుటి వ్యక్తి

ఒకానొక హైస్కూలు టీచరన్న పరిజ్ఞానం ఆగంతకుడికి బొత్తిగా ఉన్నట్టు లేదు. అతని ధోరణి అతనిది. అతనివే ప్రశ్నలు! అతనివే సమాధానాలు. కనుబొమలు పైకెత్తి ముక్కును క్రిందికి దించి ప్రసంగం మధ్య మధ్యలో ఆశ్చర్యార్థకపు గుర్తులు!

అరగంటసేపు గాలివానలా పీడించిన తరువాత అతడు సెలవు తీసుకున్నాడు. ధర తగ్గుట హెచ్చు కొరకే నన్నట్టుగా ఆ సెలవు తీసుకోడం గూడా మళ్ళీ కలుసుకోడానికే! ఒకటి, రెండు రోజుల్లో అతడు రమాపతిని ఇంటిదగ్గరే సంధిస్తూ వచ్చాడు. గృహిణితో పరిచయం చేసుకుని అలా మగల దాంపత్యం తాలూకు ముద్దూ ముచ్చటలు గమనిస్తూ వచ్చాడు.

"ఎవడోగానీ 'జూ' లో ఉండవలసిన వాడండీ రమాపతిగారూ!" అన్నాడు డ్రాయింగు మేష్టారు కోదండం.

"ఎందుకైనా మంచిది! ఎవడైనా పేషంటు పిచ్చి ఆసుపత్రి నుంచి పారిపోయి వచ్చాడేమో తెలుసుకుంటావా రమాపతీ!" అన్నాడు లెఖ్ఖల టీచరు రామకృష్ణ.

"ఇంతకూ ఇత డెవరో, ఏవిధంగా నీకు పరిచితుడో చెప్పవయ్యా రమాపతీ! అతగాడి ఉదంత మేమిటో ఆకర్ణింపగా కుతూహలం బయ్యెడిని" అన్నారు తెలుగు పండితులు అవధానిగారు.

"అబ్బే, పెద్దగా పరిచయ మేముందండీ! జీవితం కదా! ఎందరినో కలుసుకుంటాము. విడిపోతాము. అందరినీ జ్ఞప్తిలో ఉంచుకోగలమా!" అంటూ పొసగీ పొసగని మాటలతో తప్పించుకున్నాడు రమాపతి.

కానీ, అప్పటికప్పుడు తప్పించుకోడంతో ఏమైంది? ఇదేదో అపశ్రుతిలా తనను వెన్నంటే సూచన లున్నాయి. వీడి పేరు కామేశం. చిన్ననాటి స్నేహితుడు. ఆ వీధిలోని కుర్రాళ్ళ కందరికీ రింగ్ లీడరు వంటివాడు. మిత్ర బృందంలో వాడి మాట కెదురుండేది గాదు. ఎటొచ్చీ వాడి వాప్ప మిగిలిన వాళ్ళకు మల్లే కలిగినవాడు కాదు. అందుకు తోడుగా చదువుపైన వాడి శ్రద్ధ అంతంత మాత్రం! ఫీజు ఫారంతో వాడి చదువు ఆగిపోయింది. ఆ తరువాత అత డొకటి రెండు పర్యాయాలు మాత్రం కనిపించాడు. ఒకసారి రైల్వేలో తాత్కాలికోద్యోగం ఒకటి చేస్తున్నట్టు చెప్పాడు. మరొకసారి కిళ్ళీకొట్టు వ్యాపారం లాభదాయకంగా ఉందన్నాడు.

ఆరోజు ఉదయం స్కూల్లోకి గాలి వానలా వచ్చిపడిన కామేశం తా నిప్పుడు స్థానిక బస్సుల కంపెనీకి సంబంధించిన మరమ్మత్తుల కార్ఖానాలో పనిచేస్తున్నా నన్నాడు. అలాగైతే యిది వీడి పరి క్రొత్త అవతార మన్నమాట!

మధ్యాహ్నం ఇంటికి రాగానే రమాపతి భార్యను పిలిచి "చూడు రాజేశ్వరీ! మనపాలిటి కీవూళ్ళో ఒక తోకచుక్క మొలిచింది" అన్నాడు.

"తోకచుక్కా!" విస్తుపోయింది రాజేశ్వరి.

"అవును మరి! నిజమే!! ఆ తోకచుక్క పేరు కామేశం. రేపో మాపో వాడు మనపైన విరుచుకపడిపోగల ప్రమాదం ఉంది. మనం జాగ్రత్తగా ఉండడం ఎంతైనా అవసరం!" ఎందుకంటావా, ఆ కామేశంగా డున్నాడే, వాడు పొమ్మని మెడబట్టి గెంటినా చూరు పట్టుకుని వ్రేలాడే రకం!"

"అలాగా! అయితే మీ కెందుకూ, మీ రూరుకోండి. పొమ్మనకుండా పొగబెట్ట నాచేత నౌను" అంది రాజేశ్వరి.

కానీ, తీరా కామేశం వచ్చిన తరువాత పొగబెట్టలేక పోయింది. రాజేశ్వరి. పళ్ళతో, పూలతో, ప్రసన్న వదనంతో మూర్తీభవించిన బంధు ప్రేమలా వచ్చాడు కామేశం! వచ్చినవాడు తెచ్చిన పళ్ళన్నీ భార్యాభర్తలకు వొలిచిపెట్టి తాను మాత్రం బాల్యస్మృతులు నెమరు వేసుకో సాగాడు. 'అలాంటి రోజులిక రావురా రమాపతీ! తాటిముంజలు తిని, కడుపునిండా ఏటి చలమలో నీళ్ళు త్రాగి యిసుక తిన్నెలపైన ఆటలాడుకుని ప్రొద్దు గ్రుంకు చీకటి పడ్డాక యింటిదారి పట్టి తల్లి దండ్రుల దగ్గర మెత్తగా నాలుగు చీవాట్లు తిని ఒళ్ళెరుగకుండా పడి నిద్రపోయే రోజులు మళ్ళీ ఎప్పుడొస్తాయి? వయసు పైబడినకొద్దీ బరువులు, బాధ్యతలూ మనిషిని కృంగదీసేస్తాయి తోడునీడగా ఉండే అర్ధాంగి, నవ్వుతూ ఎదురయ్యే బిడ్డలు, మనసిచ్చే స్నేహితులు లేకపోతే ఈ జీవితం పక్కా ఎడారే ననుకో! .... అన్నట్టు మీ రిద్దరూ ఒకసారి మా యింటికి రావాలమ్మా రాజేశ్వరీ! ఎప్పుడో కాదు. నాలుగు వీధులు దాటి రావడానికి వాయిదాలు కూడా ఎందుకు? ...."

"అలాగే అన్నయ్యా! తప్పకుండా వస్తాముగానీ మీరీపూట భోజనం చేయందే వెళ్ళగూడదు" అంది రాజేశ్వరి.

ఆచరణలోకి వచ్చేసరికి తన హెచ్చరిక బూడిదలో పోసిన పన్నీరైపోయినందుకు లోలోపల అగ్గి, మీద గుగ్గిలమై పోయాడు రమాపతి. కానీ పైకి మాత్రం "ఔనౌనురా కామేశం! భోజనం చేసి వెళ్ళు ...." అన్నాడు.

కానీ రమాపతి ఊహించినట్టు తిండికోసం అంతగా కక్కుర్తి పడేవాడిలా కనిపించలేదు కామేశం! "భోజనానికి కేమమ్మా! ఎప్పుడో ఒకప్పుడు నా అంతట నేనే వూడిపడగలను. ఇంటి దగ్గర భోజనంచేసి వచ్చాను. గనుక, యిప్పుడు మళ్ళీ రెండో విడత భోజనానికి సిద్ధ మయితే మీకు పెట్టిన తృప్తీ ఉండదు. నాకు తిన్న తృప్తీ ఉండదు" అన్నాడు కామేశం.

ఉండి ఉండీ ప్రాణాంతకమైన సందేహాలను బయటపెట్టే రాజేశ్వరి కామేశం వెళ్ళిపోగానే "అదేమిటండీ! ఇలాంటి మంచివాణ్ణి పట్టుకుని తోకచుక్క అనేశారూ!" అంటూ సాగదీసింది.

తాను నిల్చున్నచోట భూకంపం వాటిల్లినట్లు తలక్రిందులైపోయాడు రమాపతి. "అహాఁ, అది, కాదు రాజేశ్వరీ! మరి .... ముఖాన్ని చూచి గానీ మాటల్నిబట్టి గానీ మంచితనాన్ని నిర్ణయించ గూడదు. వీ డున్నాడే కామేశం—పైకి కనిపించే టంత మంచివాడు కాడు...."

తన సంజాయిషీ తన చెవులకే కృత్రిమంగా ధ్వనించడంవల్ల నైతేనేమి, సంజాయిషీ పూర్తిగాక మునుపే రాజేశ్వరి వంటగదిలోకి వెళ్ళిపోవడంవల్ల నైతేనేమి రమాపతికి మళ్ళీ మౌనమే శరణ్య మైంది.

* * *

మానవుడు దేనినుంచి దూరంగా లనుకుంటాడో అది వాడికి మరింత సన్నిహితం గావడం విధి లీలకు సంబంధించిన విచిత్రాల్లో ఒకటి. కామేశం పట్ల తన కెందుకు వైముఖ్యం కలిగిందో రమాపతికి తెలియదు. ఆమాత్రం ఆత్మపరిశీలనకు అతడు పూనుకోలేదు. బహుశా కామేశం సంస్కారము లేనివాడని రమాపతి భావించి ఉండవచ్చు

నా పాట

చందూ

ఈ గాలి హోరులో
సెలయేటి జోరులో
నేను పాడేపాట
నాకె వినపడదాయె...

నా పాటతో పోటి
సెలయేటి జోరు
అద్దానితో పోటి
సుడిగాలిహోరు...

ఈ జోరు ఈ హోరు
నేను పాడే తీరు
ప్రకృతిలో లీనమై
ప్రవహించి పోయాయి...

మా పాటలో రాలు
కరగి పోలేదేమొ
మా పాటలో పూలు
వికసించ లేదేమొ...

చుట్టూ కూర్చున్న చెట్లన్ని
ప్రేక్షకులుగా మారి
మా పాటను వినీ వినీ
గలగల నవ్వాయి...

ఈ గాలి హోరులో
ఈ యేటి జోరులో
నేను పాడే పాట
నాకె వినపడదాయె... ★

సంస్కారం

అతనితో కలిసి మెలిసి తిరగడం తన అంతస్తుకు తగనిపనిగా అతనికి తోచిఉండవచ్చు. వింతలలో కల్లా వింత మానవుడి మనస్సు. వెయ్యి ధాతువుల రసాయనిక సమ్మేళనం లాంటిదది. ఎవడి మన స్సులో ఏముందో వాడికే తెలియనప్పుడు, ఇక ఇంకొకవాడి మానసిక ప్రవృత్తుల్ని సూక్ష్మ వివరాలతో సహా విశ్లేషించి చెప్పడం ఎవడితరం ?

వీధిలో ఎక్కడైనా కామేశం తారసిల్లితే రమా పతి యిరకాటంలో తగులుకున్నట్టు గింజుకునే వాడు. ఆ తారసిల్లడం గనుక హైస్కూలు మిత్రుల సమక్షంలో నయితే రమాపతి ముంత పొగలో వూపిరాడనివాడిలా విలవిల లాడిపోయేవాడు. ఒకప్పుడు గత్యంతరంలేక కామేశం పలకరింపుల్ని పరామర్శల్ని సహిస్తూ, ముభావంగా ఉండిపోయే వాడు. మరొకప్పుడు మొగమాటానికి స్వస్తిచెప్పి దులపరించుకునేవాడు. కామేశం గాకుండా మరొక డెవడైనా అయితే అంతటితో రమాపతి అంత రంగంలోని యింగితాన్ని అవగతం చేసుకో గలిగి ఉండేవాడు. సంస్కారాన్ని గణించి చెప్పడానికి నిర్ణీత మైన కొలబద్దలు లేవు. కనుక కామేశం సంస్కారహీనుడౌనా కాదా అన్నది వివాదాస్పద మైన విషయం. కాని కామేశాన్ని గురించి నిస్సంశ యంగా ఒకమాట చెప్పుకోవచ్చు. పరేంగితాన్ని పసి గట్టే తెలివితేటలకూ అతడికి చాలా దూరం. కామేశం కందుకంలాంటి వాడు. గోడకు వేసిన మోదినకొద్దీ, మళ్లీ కొట్టినవాడి వైపుకే తిరిగి రావడం కందుకం స్వభావం !

భార్యాసహితంగా వచ్చి రమాపతి తన యింట ఆతిథ్యం స్వీకరించగలడన్న ఆశ లరొక ఎండ మావిలా నాలుగైదు మాసాలపాటు కామేశంతో దాగుడుమూత లాడుకుంది. "పిలుస్తూనే ఉన్నా వుగా ! ఎప్పుడో వస్తాములే !" అనేవాడు రమా పతి. నిజమే కాబోలు ననుకున్నాడు కామేశం. ఆఖరు కొకనాడు రమాపతి "రావాలని నిర్బంధ మేముంది! వస్తే వస్తాం. లేకుంటే లేదు" అనేశాడు.

అప్పటికీ మిత్రుడు తనతో పరిహాస మాడు తున్నాడేమో ననుకున్నాడు కామేశం.

మళ్ళీ కొంతకాలం గడిచిపోయింది.

ఓరోజు రాత్రి తొమ్మిది గంటలవేళ పాలార బోసినట్టు కాస్తోంది వెన్నెల. పగటిపూట ఎండ దెబ్బకు శోషిల్లిపోయిన ప్రాణాలకు హాయిగా చల్లటి గాలి వీస్తోంది. ఇంటికి వెనక ఆరు బయట చాప వేసుకుని పడుకున్నాడు రమాపతి. దగ్గరగా లాంతరు వెలుగులో పత్రిక చదువుకుంటోంది రాజేశ్వరి. కామేశం అన్నీ అపకతవక పనులు చేయడానికే పుట్టా డనుకునే రమాపతి గూడా అలాంటి ప్రశాంత సమయంలో అతడు వూడిపడవచ్చు ననుకోలేదు. అనుకోకపోతే నేమి, అంతపనీ జరిగింది ! తలుపు దబదబా బాది, రాజేశ్వరి గడియ తీయగానే ముఖం లోపలికి చూపించి "మరేం భయపడొద్దు" లేవమ్మా రాజేశ్వరీ ! భోజనం చేసే వచ్చాను. కానీ కాసిన్ని మంచినీళ్లు మాత్రం త్రాగలేకపోను అంటూ రమాపతిని సమీపించాడు కామేశం !

మిత్రుణ్ణి కూర్చోమనైనా చెప్పలేదు రమా పతి. కామేశం చాపపైన కూలబడ్డాడు. కూర్చున్న కాసేపటికి "ఏమిటోరా రమాపతీ ! ఇప్పుడే ఇంటికి వెళ్లి స్నానంచేసి భోజనం చేశాను. ఎందుకో బుద్ధి సీసైకి మళ్లింది. చక్కా వచ్చేశాను." అంటూ తలగడ పైకి ఒరిగిపోయాడు.

వచ్చినవాడు దూరంగా కూర్చోకుండా తాను పడుకున్న చాపపైన్నే కూర్చోడ మేమిటి ! కూర్చున్నాడుటో, అంతటితో ఆగకుండా తన శరీరాన్ని చిత్తు చిత్తు చేస్తూ తలగడపైకి వ్రాలి పోవడ మేమిటి ? కామేశం ప్రవర్తన రమాపతి కేమాత్రము నచ్చలేదు. కానీ, ఆగ్రహాన్ని ఎలా వ్యక్తం చేయాలో అతనికి తోచడంగూడా లేదు.

"అన్నయ్యా ! మంచినీళ్లు" అంటూ పళ్లె రంలో ఉపాహారంతో సహా ప్రత్యక్షమైంది రాజేశ్వరి.

కామేశం ఫలహారం స్వాహా చేసి ఒక గుక్కలో గ్లాసు ఖాళీ చేసేశాడు. గొంతుక సవరించు కుంటూ అసలు విషయానికి మెల్లిగా ఉపోద్ఘాతం ప్రారంభించాడు.

"మా ఆవిడ దగ్గర నేను తలెత్తుకుని తిరగ లేక పోతున్నానురా రమాపతీ !"

"పోనీ, తల దించుకునే తిరుగు !" ఎండు పుల్లను విరిచినట్లు పెళుసుగా బదులు చెప్పే శాడు రమాపతి.

వెన్నెల్లో కామేశం ముఖం వెలవెల పోవడం గమనించింది రాజేశ్వరి.

కామేశం నోటికి తాళం పడిన మాట నిజం. అత డెంతగానో ప్రయత్నించాడు. వూహుఁ, మాట పెకిలిందిగాదు. పది పదిహేను నిమిషాలు మౌనం గానే గడిచిపోయాయి. కామేశం ఓ నిర్ణయానికి వచ్చినవాడిలా తటాలున లేచి కూర్చున్నాడు మూర్చుంటూ "నీతో ఒక మాట చెప్పాలి రమా పతి !" అన్నాడు.

"రహస్యమా !" అన్నాడు రమాపతి కామేశం ముఖంలోకి విచిత్రంగా చూస్తూ.

"వడ్లగింజలో బియ్యపుగింజ ! రహస్య మేముంది నా తలకాయ ! మిత్రుడివి. అంతరంగి కంగా నా మనసులోని విషయాలు బయటపెట్టు కుందామని ...."

"ఐతే పద" అంటూ రమాపతి లేచి నిల్చుని చరచరా వీధిలోకి వచ్చేశాడు.

వీధిలోకి వచ్చిన రమాపతి ఒక్క విసురుతో ముందుకు తిరిగేసరికి, వెనువెంటనే వచ్చిన కామేశం ఓ అడుగు వెనక్కు వేసి "మరేం లేదురా రమా పతి ! నీకొక కొరత వుంటే ఉండవచ్చు. మాటి మాటికి మిమ్మల్ని పిలవడమే గాని మేము మీ యింటికి వచ్చి ఒకటి రెండు పూటలుండి పోవడం నీ మనసుకు బాధాకరంగానే ఉంటుంది. కానీ ఒక విషయం గమనించాలి నువ్వు ! మీరైతే భార్యాభర్త ఇద్దరు ! మేము పిల్లా జల్లా కలిసి అర డజను మందికి తక్కువగా లేము. పైగా అమ్మా యిని చూద్దామంటే పట్టి మనిషిగా కూడా లేదు. ఇలాంటప్పుడు బంధువుల ఇళ్లకు వెళ్లాలనీ, విందులు తినాలనీ, వినోదంగా కాలం గడపాలని ఆడవాళ్ల కెన్నయినా కోరిక లుంటాయి...."

"ఇదిగో కామేశం !" కటువుగా అడ్డు తగి లాడు రమాపతి. "ఎవరి కోరికలు వాళ్ల కుంటాయి ఎవరి హద్దులు వాళ్ల కుంటాయి. మమ్మేమో పిలి చావు. రావడమో, రాకపోవడమో నిర్ణయించుకునే వంతు మాది. మా పాటుకు మమ్మల్ని బ్రతక నివ్వకుండా నువ్వెందు కిలా తొందర పెడతావో తెలియకుండా ఉంది !!...."

అలాంటి జవాబు వస్తుందని కలలోనైనా అను కోని కామేశం కృంగిపోయాడు.

* • *

కాల మొక్క రీతిగా గడవదని చెబుతారు లోక జ్ఞులు. సన్నగా, పూల రెమ్మలా యింటిలో అమూల మంచి ఈ మూలకు చకచకా తిరుగుతూ ఉండిన రాజేశ్వరి పండ్ల బరువుతో వంగిపోయిన రసాల వృక్షంలా బుట్ట బొమ్మలా తయారైంది. కానీ నవమాసాల కింకా వ్యవధి లేకపోలేదు. ప్రతి రోజూ మామగారి రాకకోసం ఎదురుచూస్తున్నాడు రమాపతి. మామగారు రాగానే రాజేశ్వరి పుట్టిం టికి వెళ్లిపోయింది. ఆ తరువాత తన బ్రతుకు 'సత్రంలో భోజనం, మఠంలో నిద్ర' కు దీటో అయిపోతుంది. గత్యంతర మేముంది ? ఈ వియో గము తప్పనిసరి. ఆమాటకొస్తే వియోగానంతర సంయోగం నిర్భరానంద హేతువు. అందుకు తోడుగా పొత్తిళలో చిన్నారి పాపతో సహా తరలి వస్తుంది రాజేశ్వరి. అప్పుడప్పుడవా ఆ సన్నివేశాన్ని తలచు కుని పులకితు డవుతున్నాడు రమాపతి.

ఓరోజు ఉదయం నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని పత్రికా పఠనం కోసం రీడింగురూము దాకా వెళ్ళొచ్చాడు రమాపతి. గంట ఎనిమిదిన్నర కావస్తున్నా రాజేశ్వరి యింకా పడకమీన్నుంచి లేవలేదు. "అదేమిటి రాజేశ్వరీ ! ఇంకా తెల్లవార లేదా నీకు ?" అన్నాడు రమాపతి.

"ఏమిటోనండి ! ఒళ్లు ఒకమాదిరిగా ఉంది" అంది రాజేశ్వరి.

అంతకుమునుపు దినపత్రికలో పడిన మునకమ గురించి, వివాహ ప్రమాదాలను గురించి చదివిన రమాపతి, అవన్నీ తన వెనకనే వచ్చి ఒక్కుమ్మ డిగా ఇంటిలోపలికి జొరబడినంతగా గగ్గోలు పడి పోయాడు. నిల్చున్నచోట నిల్చోలేక, కూర్చున్న చోట కూర్చోలేక ఏవేవో సందేహాలతో, భయా లతో కలవరపడి పోయాడు. తలవు చీటి వ్రాసి హెడ్మాస్టరుగారికి పంపించాడు. ఆ తరువాత ఏం చేయడానికీ పాలుపోక "వెళ్లి డాక్టరమ్మగారిని పిలు చుక రమ్మంటావా రాజేశ్వరీ" అన్నాడు.

"డాక్టరమ్మగా రెందుకుగానీ, ఒకసారి ఎదురింటి

56 వ పేజీ చూడండి

"వివాహితులైనవాళ్ళే ఉద్యో గాని కొవాలన్నా రెందు కయ్యా !" అన్న ఒక స్నేహితుని ప్రశ్నకు.

"వాళ్ళయితేనే మనం కోప్పడ్డా పడుం లరు", అని షాపు యజమాని సమాధానం.

రంగారావు (కాకరపర్రు.)

క్యాలెండరు

నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలెండరు బొమ్మలను క్యాలెండరు మాన్యుఫ్యాక్చర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము. మంచి కమీషన్‌పై పని చేయుటకు సమర్థులైన ఏజంట్లు కావలెను. వెలలు 50% తగ్గింపబడినవి. వ్రాయండి :

Ajanta Art Calendar Mfg. Co.,
P. B. 255, Madras—1.

Swastik

పండిత
డి. గోపాలాచార్యులవారి

జీవామృతం

ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

పామాలీవ్ లవెండర్
పొందాగాను... అందముగాను...
వుండు మనోహరమగు సువాసన !

ఇవి యిప్పుడు మీకు పామాలీవ్
టాల్కులో లభించును. కొంచెము
పామాలీవ్ లవెండర్ మీ చర్మము
మీద చల్లుకొన్నచో, ఉత్తేజపరచే
సువాసన మీ చుట్టూ వెదజల్లును.
పామాలీవ్‌ను వాడి ఎల్లప్పుడూ
తాజాగాను, ఆహ్లాదముగాను వుండండి.



పామాలీవ్ డీలక్సు-17 విదేశీ సువాసనలుగల మిశ్రమము !

PT. G. 6. TEL

సంస్కారం

11 వ పేజీ తరువాయి

బామ్మగారిని వచ్చి వెళ్లమని చెప్పండి" అంది రాజేశ్వరి.

తన విధానానుభవాల పరిజ్ఞానంతో రాజేశ్వరిని పరీక్షించి చూచిన బామ్మగారు "చూడు నాయనా ఇదేమిటో విడ్డూరంగా ఉంది. అమ్మాయి నెలలు పూర్తికాలే దంటుంది. కానీ, చెబుతున్న లక్షణాలనుబట్టి ఆమాట నమ్మడానికి లేదు. ఎందుకైనా మంచిది. మీవాళ్ల కెవరికైనా కబురుపెట్టు" అంది.

మధ్యాహ్నం హోటల్లో నుంచీ కారియర్‌లో భోజనం తెప్పించాడు రమాపతి. తింటేగానీ ఒప్పుకోనని మొండికెత్తి కూర్చున్న రమాపతి సంతృప్తి కోసం రాజేశ్వరి పట్టెడన్నం తిని, తిన్నదంతా వమనం చేసుకుంది.

మామూలు ప్రకారం సాయంకాలపు వాహ్యాళికి బయల్దేరిన హైస్కూలు మిత్రులు వీధిలో నిల్చుని ఎలుగెత్తి రమాపతిని పిలిచారు. తెరలు తెరలుగా దిగులు పొరాడుతున్న ముఖంతో రమాపతి ఈవలికి వచ్చి హఠాత్తుగా తానెదుర్కోవలసి వచ్చిన పరిస్థితిని గురించి స్నేహితులతో చెప్పుకున్నాడు. మిత్రులందరూ ఏకకంఠంతో సానుభూతి ప్రకటించారు. "ఈ వూళ్లో మంచి వైద్య సహాయం లభిస్తుందా రమాపతీ !" పట్నానికి తీసుకెళ్లి ఉంటే బాగుండేది" అన్నారొకరు. "ఎందుకూ ! డబ్బివ్వగలిగితే రాణీపేట నుండి నర్సు పరుగెత్తుకుంటూ రాదూ" అన్నారు వేరొకరు. "ఐనా, డాక్టర్లు, నర్సులు చేయగలిగింది మాత్రం ఏముంది ? ఎవరైనా ఆత్మీయులు అండగా ఉండటం అవసరం" అన్నారింకొకరు. ఎవరికి తోచిన అభిప్రాయాన్ని వారు సెలవిచ్చి, నవ్వులతో, కేరింతలతో దూరంగా వెళ్లిపోతున్న మిత్రుల్ని చూస్తూ వేడిగా నిట్టూర్చాడు రమాపతి.

అర్ధరాత్రి వరకూ ఉండి ఉండి నొప్పులు కనిపించాయి. ఆపైన రాజేశ్వరికి కాస్త కునుకు పట్టింది. కానీ, రమాపతి మాత్రం నిద్రపోగలిగిన స్థితిలో లేడు. ఇలాంటి సందర్భాల్లో ఏ సమయానికి ఎలా ఉంటుందో వూహించడం కష్టం. దేవుడి దయవల్ల ప్రస్తుతాని కేమీ తొందర లేకపోతే రేపు సాయంకాలానికల్లా అత్తగారిని తీసుకు రావచ్చు ననుకున్నాడు.

మిగిలిన రాత్రి ప్రశాంతంగానే గడిచింది. ఉదయం మొదటి బస్సుకే అత్తగారి వూరికి బయల్దేరాడు రమాపతి. బస్సు పాతికమైళ్ల వేగంతో పరుగెడితే మూడుమైళ్లల్లో ఆవూరు చేరుకోవచ్చు కానీ, వాయువేగాన్ని మించి పయనించే మనోవేగం ముందు బస్సు వేగం ఏపాటిది ? పోగా మార్గమధ్యంలో ఎదురైన ప్రతి నాష్టా అంగడి దగ్గరా బస్సు ఆగిపోతూ వచ్చింది. అయిన టీ నీళ్లన్నీ త్రాగి ఆపసోపాలు పడిపోతున్న మహోదరుడైన బస్సు డ్రయివరు తన కాయాన్ని కదలిస్తున్నంత మెల్లగానే బస్సును కూడా తరలిస్తున్నాడు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు గానీ బస్సు గమ్యస్థానం లేకపోయింది. చేరుకోరిక్షా

చేసుకుని అత్తగారింటి ఎదుట వ్రాలాడు రమాపతి. వ్రాలగానే ఏమైంది ? మూసిన కిటికీలతో, వేసిన తలుపులతో బిగించిన తాళాలతో ప్రత్యక్షమైన అత్తగారింటి ఎదుట చేష్టలు దక్కి విగ్రహంలా నిల్చుండిపోయాడు రమాపతి.

కోలుకున్న తర్వాత వాకబు చేయగా తెలిసింది—అత్తమామ లిద్దరూ యాత్రా స్పెషల్లో బయల్దేరి పూరీ, కలకత్తాల మీదుగా ఉత్తరదేశ యాత్రలకు వెళ్లిపోయారని !

ఆ క్షణాన బంధువర్గం మీద రమాపతికి పట్టరానంత కోపం వచ్చిన మాట వాస్తవం ! ప్రసవానికింకా ఒకటి రెండు మాసాల వ్యవధి ఉండవచ్చునని తాను సూచనగా జాబు వ్రాసిన మాట నిజమే! ఐతే మాత్రం ? తీర్థయాత్రల కిదా సమయం ? అసలీ అత్తారింటి వారికి ఆదినుంచీ తనపట్ల చిన్నచూపు కద్దు ! మొదటి అల్లుడేదో ఇంజనీరు. రెండో అల్లుడు బాగా ఆర్జిస్తున్న లాయరు. ఎటొచ్చీ మూడో అల్లుడైన తాను మాత్రమే బడిపంతులు!

'ఛా ఛా, ఏం మనుషులు!'—అనుకున్నాడు రమాపతి.

అత్తగారి వూరునించీ రమాపతి సరాసరి స్వగ్రామానికి బయల్దేరాడు. రాత్రి పది గంటలప్పుడు గ్రామంలో బస్సు దిగాడు. వసారాలో మంచం పైన పడుకున్న నరసింహంగారు, ఓ కార్డు ముక్కయినా లేకుండా హఠాత్తుగా వూడిపడిన కుమారుణ్ణి చూచి కంగారు పడిపోయారు. ''ఏమిట్రా రమాపతీ ! ఏమైంది ? అమ్మాయి కులాసాగా ఉంది కదూ ?'' అంటూ పరామర్శించారు.

''కులాసాగానే ఉంది నాన్నా ! నొప్పులు ప్రారంభమౌతున్నట్లున్నాయని చెబితే అమ్మను పిలుచుక పోదామని వచ్చాను' అన్నాడు రమాపతి.

''మీ అమ్మను పిలుచుక పోదామనా ! అందు కోసం వచ్చావా ! అదెక్కడుందిరా రమాపతీ ! మీ అక్కయ్యకు ప్రసవం చేయడానికి అని మొన్ననే హిందూపురం వెళ్లిపోయిందిగా ! ఐనా అమ్మాయికి ఇది మొదటి ప్రసవం గదా ? రమాపతీ ! ఆవిడ పుట్టింటివాళ్లేమయిపోయారు ?'' విస్తుపోతూ అడిగారు నరసింహంగారు.

రమాపతి హతాశుడై అరుగుపైన చతికిల బడిపోయాడు.

* * *

మరునాటి ఉదయం తొమ్మిది గంటలకు భూమి గుండ్రంగానే ఉందని బుజువుచేస్తూ క్రితంరోజు ఉదయం ఎక్కడైతే బయల్దేరాడో అక్కడే బస్సు దిగాడు రమాపతి. సుడిగాలిలో నూలు తెగిన గాలిపటంలా కొట్టుకపోతూ అతడు సందు మలుపు-తిరగగానే తల పైకెత్తి ఇంటి వైపు చూచాడు. చూచిన క్షణంలో అతడి శరీరంలోని రక్తం నరాల వెంట శరవేగంతో పరుగులు తీసింది. ఎందుకోగానీ ఇంటి ఎదుట జనసందోహం ప్రోగైంది. రమాపతి యిప్పుడు నడవడంలేదు. పరుగెడుతున్నాడు.

''శుభవార్తరా రమాపతీ ! నోటి నిండుకూ చక్కెర పోసిన తర్వాత గానీ చెప్పను. తెరువు. నోరు తెరువు''—చక్కెర కోసం చేతులు చాస్తున్న కుర్రాళ్ల నందరినీ తొలగ ద్రోసుకుని రమాపతి ఎదుటకు వచ్చేస్తున్నాడు కామేశం !

''బలేవారండీ మీరు ! లేకపోతే లోపలికైనా రానివ్వకుండా వీధిలోనే నిలబెట్టేస్తారా ! నాన్నగారు కనిపించలేదనేమో, కుర్రకుంక అదేపనిగా గొంతు చించుకుంటున్నాడు'' అంది తలుపు చాటున నిల్చున్న కామేశం భార్య.

మిత్రుడి ఎదుట ముఖాముఖిగా నిల్చోలేక ముఖం అవలికి త్రిప్పుకున్నాడు రమాపతి. పుత్రోదయం మాటకేమి గానీ రమాపతికి జ్ఞానోదయం కూడా అయింది. జ్ఞానోదయానికి చిహ్నాలే అతడి కళ్లల్లో నిలిచిన ఆనంద బాష్పాలు ! ★


నల్లులను
చంపును
ఏ.జేస్
బగ్‌సేలిన్-20
సాగ్‌సన్స్ కెమికల్ కో., మద్రాసు-21.

తలనొప్పి
పోగొట్టుకోండి ఇదుగో
అమృతాంజనము
అమృతాంజన్‌లో 10 రకాల శమనం కల్గించే ఔషధాలు చేరడంచేత ఇది శీఘ్రంగా అమోఘంగా నివారణను కలిగిస్తుంది. ప్రతీ సారి పిసరంత చాలు కాబట్టి ఒకే సీసా నెలల తరబడి వస్తుంది. 70 ఏళ్ళ ప్రశస్తినిగన్న ఇంటి మందు. అమృతాంజన్ కండల నొప్పి, బెణుకు, గుండె జలుబు ఇంకా ఇతర నొప్పులు, జలుబులు మరియు ఇతర బాధలకు అమోఘమైనది.
వాతావరణం మార్పు సంసారంలో తీవ్రత్రయాలు, నొప్పులు, జలుబులు మరియు బాధలు కలిగిస్తాయి. ఎప్పుడూ అవసరానికి అందుబాటుగా అమృతాంజన్ ఉంచుకోండి.
అమృతాంజన్ 10 రకాల
ఔషధాలు చేరిన మందు


అమృతాంజన్ క్రొత్తగా అట్ట పెట్టెలో వస్తుంది. సీసా 'అలూ' క్యాప్‌తో సీలు చేయబడింది.
అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు • బొంబాయి • కలకత్తా • ఢిల్లీ
WT/AM-2329A